# అనుమానం

కొత్త పట్టుచీరె కట్టుకొన్న శోభ, ఈజీచైరులో తీరిగ్గా కూర్చుని భగవద్గీతా పారాయణ చేస్తున్న అత్తగారి పాదాలకు వంగి నమస్కరించింది.

ఒక్కసారి తల పైకెత్తి కళ్ళజోడులో నుంచి చూసి.

"ఎందుకమ్మా కాళ్ళకు మొక్కుతున్నావ్?" అంది సుందరమ్మగారు.

"కొత్తచీరె కట్టుకున్నా నత్తయ్యా" అంది శోభ.

తలెత్తి ఈసారి కోడలిని పరకాయించి చూచిందామె. సన్నగా, పొడుగ్గా, తెల్లగా వున్న కోడలికి ఆ చీరె ఎంతో బాగుంది. నవ్వుతున్న శోభ ముఖం, నిజాన్ని దాచలేము అన్నట్లున్న ఆ పెద్దపెద్ద కళ్ళూచూచి ముఖం దించుకొని మళ్ళీ పుస్తకంలోకి చూడసాగింది. అత్తయ్య ఏదో అడగబోతూంది అని నిలబడ్డ శోభ మాట్లాడకుండా ముందుకు సాగింది.



"శోభా" కర్ణకఠోరంగా వినబడ్డ కేకకు వెనుకకు తిరిగిచూచింది శోభ. గుమ్మంలో తన భర్త మధు నిప్పులు కురిపించే కండ్లు, అదిరిపోయే పెదవులు, వణకిపోయే శరీరంతో కనిపించాడు. ఆ ఆకారాన్ని చూచిన శోభ హడలిపోయింది. తను కాపురానికి వచ్చిన ఈ నాలుగేండ్లలో ఎన్నడూ ఇలాంటి రూపాన్ని చూడని శోభ స్తంభితురాలే అయింది. కొంచెం తేరుకొన్న తర్వాత దగ్గరకువచ్చి—

"ఏమండీ వంట్లో బాగాలేదా? పడుకొందురుగాని రండి" అంటూ చేతిని పట్టుకొంది. ఆ చేతిని ఒక్క విదిలింపు విదిలించి గదిలోకి వెళ్ళాడు మధు. వెనుకనే పిల్లిలా అనుసరించింది శోభ. రెండు చేతుల్లోను తల పట్టుకొని కూర్చున్న భర్త దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయ్యివేసి -

"ఏమిటి బాధ పడుతున్నారు? నాకు చెప్పరూ?"

అతడు అమాంతంగా లేచి నిలబడి ఆమె బుజాలు గట్టిగా పట్టుకొని కుదుపుతూ -

"నిజం చెప్పు. శేఖర్ నీకిదివరకే తెలుసుగదూ?"



"తెలుసు"

"వాడిని ప్రేమించావుగదూ ?"

"అబద్ధం. ఎవరన్నారు మీతో. పెళ్ళికి పూర్వం అతనితో నా పరిచయం కూడా తక్కువ."

"కాదు. మీ యిద్దరిమధ్యా ఉత్తరాలు కూడా నడుస్తున్నాయి. పెళ్ళికాకముందే నీకు వాడితో సంబంధం వుంది. నాడబ్బుని చూసి నన్ను చేసికొని యిప్పుడు వాడితో కులుకుతున్నావ్ ?" అంటూ ఒక్కతోపు తోశాడు. ఆ తోపుకు గోడకు కొట్టుకొన్న ఆమె తిరిగిలేస్తూ -

"మీరు ఆ వేశం లో ఏమంటున్నారో మీకే తెలియటంలేదు. అతన్నే ప్రేమించి వుంటే డబ్బు ప్రశ్న ఎందుకు ? నా ఆస్తి చాలదా మాకు ? మీ మనస్సులో ఎవరో విషబీజం నాటారు. నామాట నమ్మండి. మీ పాదాలసాక్షిగా చెపుతున్నాను. మీ స్నేహితుడుగానే అతన్ని నేను గౌరవిస్తున్నాను. అంతే."

"ఛీ. నోర్మయ్"

"ఎందుకు మూయాలి ? లేనిపోని అభాండాలు పైనవేస్తే సహించి ఊరుకోమన్నారా ?"

"ఊరుకోకపోతే నడువు పట్టింటికి"

"ఇది నాయిల్లు. నే నెక్కడికీ వెళ్ళను."

తలుపు విసురుగావేసి వెళ్ళాడతను. అంతవరకూ అపుకొన్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది శోభకు. మంచంమీద పడి హృదయభారం తగ్గేవరకు ఏడ్చింది. తన తనభర్త.... తనను పువ్వుల్లోపెట్టి పూజిస్తున్న భర్త తన చిరునవ్వుకు తపించిపోయే భర్త ! ఎలాంటి నిందవేశాడు ! శోభ తలపులు ఒక్కసారి గతంలోకి పయనించాయి.

నాలుగేళ్ళ క్రితం ఈ ఇంట్లో అడుగు పెట్టింది తను. ఒక్క పది రోజులుమాత్రం కొత్తగావుంది ఎవరితోను ఎక్కువ మాట్లాడేది కాదు. ఇంట్లోవారు ...ఇద్దరుతోటి కోడళ్ళు, అత్తగారూ, ఆడపడుచు లిద్దరూ చాల ఆప్యాయంగా చూచేవారు. చిన్నకోడలికి ఎప్పుడూ సుస్తీ. పిల్లల్ని పెంచటంలో అట్టే శ్రద్ధచూపేదికాదు. ఆమె ఇద్దరి పిల్లలకూ రోజూ స్నానంచేయించటం, వారి ఆలనా పాలనా చూడటం శోభ వచ్చినదగ్గర నుండీ తనపైనే వేసికొంది. ఆ నాలుగేళ్ళ రవి, ఆరేళ్ళ సుధ పిన్నినివదిలి ఒక్క క్షణం వుండరు. ఇక పెద్ద కోడలికి ఒక్కడే కొడుకు. పన్నెండేండ్లవాడు. సురేష్. వాడు నెలకు పదిరోజులు బడికి వెళ్తాడు. ఇక ఇంట్లో వున్నంతసేపు తల్లి కొడుకులకు క్షణం పడదు. తల్లి అంటే భయంగాని, గౌరవంగాని వాడికి ఏకోశానా లేవు. డబ్బుకోసం తల్లిని పీడించటం, ఇవ్వకపోతే గ్లాసులు. అద్దాలు పగలగొట్టి తన ప్రతాపం చూపడం వాడి అలవాటు. కోపంవస్తేతండ్రిచావగొట్టేవాడు. తల్లిదండ్రులకూ, తాత ముత్తవలకూ సురే ఒక పెద్ద సమస్య అయి కూర్చున్నాడు. ఇంత చిన్న వయస్సులో వున్న కొడుకూ ఇలా తయారయినందుకు ఆ తల్లిదండ్రులెంతో బాధ పడేవారు.

అలాటి సురేష్ ఒకరోజు తండ్రి దగ్గరకు వెళ్ళి -

"నాన్నగారూ ! ఈలెక్క ఎంతచేసినా ఆన్సరు రావటంలేదు. కొంచెం చెపుతారా?" అంటూ వచ్చాడు. అప్పుడే రాత్రి భోజనం చేసి పేపరు చూస్తున్న రామారావు ఆశ్చర్యంగా చూశాడు. తన కొడుకు ఒకలెక్క చేయటం రాలేదని తెలిసికొన గోరటం ఆయనకు వింతగాతోచి -

"లెక్క ఎవరు చేయమన్నారురా ?" అన్నాడు.

"ఎవరేంటి ? స్కూలు హోంవర్కు"

"అయితే స్కూలుకు వెళ్ళవేంటి ఈ రోజు."

"ఈరోజేకాదు నాన్నగారు. నేను రోజు బడికి వెళ్తున్నాగా ? అందుకే పిన్ని నాకు రోజూ ఇష్టమైన టిఫిన్ చేసి పెడుతుంది. రాత్రి మంచిమంచి కథలు చెబుతుంది. పిన్ని నన్నెప్పుడూ కోప్పడదు నాన్నా. అమ్మకంటే పిన్నే చాల మంచిది." అని చెప్పుకు పోయాడు.

ఏ బిడ్డ అయితే ఎందుకూ పనికిరాడనీ, పుట్టకపోయినా బాగుండేదనీ నిందించేవాడో, ఆ కొడుకునుకూడా ప్రయోజకుణ్ణి చేసింది శోభ. చేతిలోని పేపరుతో అలాగే కూర్చున్న నాన్నను "లెఖ్ఖ చెప్పరా నాన్నా" అంటూ జ్ఞాపకంచేశాడు సురేష్.

అటువైపుగా వచ్చిన శోభ "నే చెబుతా రా సురేష్. నాన్న చదువుకుంటున్నారు" అంది.

"లేదమ్మా. నేను చదవటం లేదు. నీ గురించే ఆలోచిస్తున్నాను. ఏ దేవుడు నిన్ను తయారు చేశాడు. నీలో ఇంత సహనం, ఓర్పు, నేర్పు ఎలా వున్నాయి ? నీవు మా యింటికే శోభను తెచ్చావుతల్లీ. నిన్ను దేవుడు చల్లగా చూస్తాడు."

బావగారి మాటలకు సిగ్గుతో కుంచించుకుపోయిన శోభ భుజంనిండా చెంగు కప్పుకొని తలుపుప్రక్కకు తప్పుకొంది. ఇది వారిద్దరికీ అలవాటే. చనువుగా ఆయన మరదల్ని ప్రశంసించటం, బావగారి ఎదుటకే రావటానికి సిగ్గుపడే శోభ తలుపుప్రక్క నక్కటం

"పిన్నీ పిన్నీ ! అన్నం పెట్టవూ ? ఆకలవుతోంది" అంటూ వచ్చిన రవి మాటలకు ఈ లోకంలో పడింది శోభ. ఎత్తుకోమని చేతులందిస్తున్న రవిని మూగపోయిన హృదయానికి హత్తుకొని యింట్లోకి నడిచింది.

## 2

రాత్రి పన్నెండైంది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. బూట్ల చప్పుడు విని లేచి తలుపు తీసింది శోభ. మాట్లాడకుండా తనగదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుంటున్న మధుకు ట్రేలో భోజనం తెచ్చి బల్లమీద వడ్డన చేస్తున్న శోభ కనిపించింది. మంచంవైపు నడుస్తున్న భర్తతో -

"భోంచేసి పడుకోండి" అంది.

"నా కక్కర్లేదు." కటువైన సమాధానం.

"మీ ఆరోగ్యం అసలే బాగుండలేదు. ఇంతరాత్రివరకూ నిద్రలేకుండా భోజనం కూడాచేయకపోతే ఎలా ? కొంచెం పెరుగు అన్నమైనా తినండి."

"అక్కర్లేదని చెబుతుంటే ఏమిటా గోల ?"

"నామీద కోపంతో కడుపు కాల్చుకుంటారా ? నా మాట వినండి. పోనీ ఆ చక్రకేళీలు రెండు తినండి. మజ్జిగ తెస్తాను."

"నా కేమీ అక్కర్లేదు. నువ్వు పోతావా? నన్ను పొమ్మన్నావా ?" ఆ కంఠంలో క్రోధం, అసహ్యం అన్నీ మిళితమై వున్నాయి.

"వద్దు. నేనే వెళ్తాను. నా ఉనికి అంత కష్టంగావుంటే రేపే నేను అమ్మదగ్గరకు వెళ్తాను. కాని ఒక్క మాట. మీ "శోభ మాత్రం మీ కెలాటి ద్రోహం చెయ్యలేదు. మీరు ఇప్పుడా నిజాన్ని నమ్మరు. కాని ఒక రోజు....నేను నిర్దోషినని గ్రహించిన రోజు పశ్చాత్తాపంతో నా దగ్గరకు వచ్చి తీరతారు."

అభిమాన ధనురాలైన శోభ ఇంకేమీ చెప్పలేక కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"అదేంది శోభమ్మగారూ! వట్టి చాప మీద పడుకున్నారు?" అంటూ ఇల్లు వూడుస్తున్న లచ్చి లేపేవరకు మెలకువ రాలేదు శోభకు. రేడియోలో వార్తలు అప్పుడే పూర్తవుతున్నాయి. ఎదుటి గోడపై గడియారం ఏడుంబావు చూపిస్తున్నది. సిగ్గుతో శోభముఖం కందిపోయింది. ఏడు దాటింది. రోజూ తానీవేళకు ఎన్నిపనులు చక్కబెట్టేది. పూజగదిలోనుండి గంట వినిపిస్తోంది. అత్తయ్య పూజకూడా అయిందన్నమాట. రోజూ పూజకు అన్నీ తాను సిద్ధపరచి అత్తయ్యను పిలిచేది. ఈ రోజు మామగారికి బెడ్‌కాఫీ ఎవరు అందించారో? వంటవాడికి టిఫిన్ ఎవరు పురమాయించారో? రవికి ముఖం ఎవరు కడిగారో అనుకుంటూ బాత్‌రూంలోకి వెళ్ళింది.

ముఖం కడుక్కొని డైనింగు హాల్లోకి అడుగుపెడుతున్న శోభకు చిన్న ఆడబిడ్డ నిర్మల వంటవాడి మీద పెద్దగా కేకలెయ్యటం విన్పించింది.

"ఏమిటి నిర్మలా" అంటూ వచ్చిన వదినమీద విరుచుకుపడింది నిర్మల.

"ఏముందీ. నీవేమో రాణిగారిలాగ యిప్పుడు లేచివచ్చావు. ఈ రాముడేమో వట్టి పూరీలు చేసి మా ముఖాన వేశాడు. ఎలా తింటామనుకున్నాడో ఏమో?"

"కాదమ్మగారూ! ఇంట్లోనేమో నాలుగు కోడిగ్రుడ్లు వున్నాయి. అవేమో ఆమ్లెట్లువేసి అయ్యగార్లకు వుంచాను. బంగాళదుంపలు వండితే కొందరు తింటారు. కొందరు తినరు. నేనేం చేయనమ్మా" అన్నాడు రాముడు.

"ఆ! ఏంచేస్తావ్! మా కడుపులు మాడుస్తావ్" కోపంగా అంది నిర్మల.

"సరే! రాముడూ నిర్మలమ్మకు ఒక ఆమ్లెట్ యిచ్చెయ్యి. తర్వాత చూచుకొందాం. కూరలేకుండా ఆమె పూరీలు తినదని నీకుమాత్రం తెలీదూ?" అని మందలించింది శోభ.

"నాకసలు టిఫీనే అక్కర్లేదు." అని ప్లేటు ముందుకు తోసి లేచింది నిర్మల.

"సరే! ఈరోజుకు నన్ను క్షమించి తిను నేను బందరు వెళ్తున్నాను. రేపటి నుండి నీవే ఆర్డరిచ్చి కావలసినవి వండించుకో."

"మానిమ్మీ మంచిది. చక్కగా తింటుంది" అని వదిన బ్రతిమలాడుతుందని ఊహించిన నిర్మల ఈ జవాబుకు విస్తుపోయి -

"నిజంగా వెళ్తున్నావా వదినా!" అంది.

"ఎందుకూ నేనిలా విసిగిస్తున్నాననా? ఇంకెప్పుడూ విసిగించను వదినా" అంటూ చెంపలు వేసికొంది.

అప్పుడు నిర్మలను చూచి నవ్వుతూ శోభ -

"అయినా నిమ్మీ. నీనోరు కొంచెం కంట్రోలులో వుంచుకొంటే మంచిది." అని వెళ్ళిపోయింది.

"అరె! నిజంగానే పిన్ని వెళ్ళిపోయేటట్లుందే" అన్ని నోరుతెరిచాడు సురేష్. భర్త అనుమానాన్ని ఎక్కడా బయటపెట్టకుండా అమ్మను చూసి పదిరోజుల్లో వస్తానని చెప్పి బయల్దేరింది శోభ.

3

శోభను దిగవిడిచి మరుసటి రోజు వెడుతున్న మరిది రమేష్ చెప్పటానికి ఒదిన గదిలోకి వెళ్ళాడు. శూన్యంలోకి చూస్తూ ఒంటరిగా కూర్చున్న ఒదినను చూచి విభ్రాంతుడయ్యాడు. ఎప్పుడూ నవ్వుతూ, కళకళలాడుతూ తీరుబడేలేనట్లు తిరిగే వదిన, ఏడ్చేవాళ్ళనుకూడా నవ్వించే వదిన ఇలా వుందేమిటి? నిస్పృహ, నిర్లిప్తత కూడగట్టుకొన్న ఆ ముఖం పాలిపోయినట్లుంది.

"ఒదినా-"

ఉలిక్కిపడి చూచింది మరదివంక. ఆ చూపులో జీవంలేదు. ఆ కళ్ళల్లో కాంతి లేదు.

"ఒదినా! అన్నయ్యకు నీకు ఏమైనా గొడవ జరిగిందా? ఒకవేళ జరిగినా అన్నయ్యే కాళ్ళబేరానికి వస్తాడుగా. మరెందుకిలా చేశావ్?"

"రమేష్."

"దాచాలని ప్రయత్నించకు. నిన్ను వెంటవచ్చి రైలెక్కించకుండా అన్నయ్య ఎప్పుడువున్నాడు? అలాంటిది నిన్నటినుండి ఆయన ఇంట్లోనే లేడు. కనీసం నీవు వెళ్ళే వేళకుకూడా రాలేదు. అసలు ఏం జరిగింది వదినా?"

"ఏం జరిగింది? ఏ అన్యాయమైతే ఆడదానికి జరుగకూడదో అదే జరిగింది రమేష్."

"కాని వదినా జరిగిందేమిటో నీవు కనీసం అమ్మకైనా చెప్పాల్సింది."

"చెప్పి ఏం లాభం? ఆమె నన్ను రానివ్వరు. అన్నయ్యను ఇబ్బంది పెడతారు. ఆయన ఆకోపంతో ఏమైనా చేయవచ్చు. అందుకే బాగా ఆలోచించికొన్నాళ్ళు దూరంగా వుండటమే మంచిదని వచ్చాను. నీవుకూడా ఎవరికీ తెలియనీయనని మాటివ్వు"

"అలాగే కాని మళ్ళీ ఎప్పుడొస్తావ్?"

"ఆరోజు త్వరలోనే రావాలని కోరుకొంటున్నాను. ఇష్టమైనవారు ప్రార్థన చేస్తే కోరిక నెరవేరుతుందట. నా తరఫున భగవంతుడిని నీవుకూడ ప్రార్థించు."

"అదే నిజమయితే ఒక్కసారికాదు. వదినా వందసార్లు ప్రార్థిస్తాను" అన్నాడు కళ్ళు తుడుచుకొంటూ. శోభకూడా కళ్ళు తుడుచుకుంటూనే సాగనంపింది మరదిని.

గతంలో ఒకనాడు ఏదో మాటవస్తే ఈ మరది—

"నీ మాటకు ఈ యింట్లో తిరుగెక్కడిది? నీ ఆజ్ఞలేకుండా స్వర్గానికి వెళ్ళేవాడుకూడా ఈ యింట్లో లేడు" అంటే—

"ఏం. ఈమధ్య బెంగాలీ సాహిత్యమేమన్నా చదువుతున్నావా?" అంటూ తేల్చిపారేసింది తను. అలాంటి ఇంట్లో నేడు ఒక దోషిగా ఎలా నిలువగలుగుతుంది తను

"అదేమిటక్కా. మబ్బులేని వానలాగ ఊడిపడ్డావ్?" అంటూ సురేఖ ఊపేసరికి తెలివిలోకి వచ్చిందిశోభ.

---

● ఒకవృద్ధుడు: నా చిన్నప్పటి కోరికల్లో ఒక్కటిమటుకే నెరవేరింది.

రెండో వృద్ధుడు: ఏమిటది?

మొదటి వృద్ధుడు: మా మేష్టరు నన్ను స్తమానం జుట్టుపట్టి గుంజేవాడు. జుట్టు లేకపోతే ఎంతబావుండును అనుకునేవాణ్ణి.

మా ప్రచురణలు

అగ్నిశిఖలు మంచుజడులు
కవిత కిమ్మిశెట్టి

'రాత్రి' వర్థమాన యువకవుల వచన కవితా సంకలనమ్

లంబాడి రామదాసు (నాటకం)
సి. యస్. రావు
(పొద్దుటూరు రాయల నాటక కళా పరిషత్తు పోటీలలో ఉత్తమ రచన, నటన, ప్రదర్శనకు బహుమతుల నందుకొన్నది)

వీడిన పాయలు (నవల)
సింగరాజు లింగమూర్తి

సంపెంగ పొదలు
శ్రీమతి సి. ఆనందారామం
(ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ధారావాహినిగా వెలువడిన నవల.

తెగిన తీగలు
డి. ప్రమీలాకుమారి
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక క్రోధి ఉగాది నవలా పోటీలలో ప్రథమ బహుమతి పొందిన నవల)

గ్రంథాలయములకు, పుస్తకవిక్రేతలకు మంచి కమీషను యివ్వబడును. కేటలాగు కొరకు వ్రాయండి.

వివరములకు సంప్రదించండి.

సంపాదకులు :
అడపా శివాజినాయుడు

అమరసాహితి,
గోషామహల్-హైదరాబాదు

"ట్యూషన్ టైమయిందా సురేఖా."

"కాదక్కా! అమ్మకు వారం నుండి జ్వరం. ఈ రోజు పథ్యం పెట్టమన్నారు. పిన్ని నడిగి కొంచెం నిమ్మకాయవచ్చడి తీసికెళ్దామని వచ్చాను. రాజా మృదంగం, వీణ విన్నావా? ఎంత బాగా వాయిస్తున్నాడని. అక్కా! నే చెపుతున్నా చూడు. మళ్ళీ సంవత్సరం ఆలిండియా కాంపిటిషన్‌కు పంపుతాను." అంటూ లోపలకు వెళ్ళింది సురేఖ.

అబ్బ! సురేఖ ఎంత మారింది? రెండు సంవత్సరాల క్రితం ఆ వీధిలో ఒక పెంకుటింట్లో దిగారు సురేఖవాళ్ళు. సురేఖకు అమ్మ, మామయ్య, అత్త తప్ప ఎవరూ లేరు. అత్త అచ్చు సినిమాలో సూర్యకాంతం అంటుంది సురేఖ. చిన్నప్పటి నుంచి సురేఖను వాళ్ళమ్మ అల్లారుముద్దుగా పెంచింది. చదువుతోపాటు వీణకూడా నేర్పించింది. అసలే సురేఖది శ్రావ్యమైన కంఠం. దానికితోడు వీణ మీటుతుంటే హృదయ తంత్రులను మీటుతున్నట్లు వుంటుంది. సురేఖ స్కూలుఫైనలు ప్యాస్‌కావడం, వాళ్ళమ్మ ఆరోగ్యం దెబ్బతినడం యించుమించు ఒకసారే జరిగాయి. సురేఖను ఒంటరిదాన్ని చేయటం ఇష్టంలేక అన్నదగ్గరకు వచ్చి వున్న డబ్బు, నగలతోపాటు సురేఖనుకూడా అన్నకు అప్పగించింది. ఫలితం—సాధారణంగా చాలమంది అన్నలు చేసినట్లు ఆ డబ్బు దస్కం తీసుకోవడమే కాకుండా సురేఖ టీచరుచేసి సంపాదిస్తున్న జీతం, సంగీతం ట్యూషన్ల జీతంకూడా హరిస్తున్నాడు మామయ్య.

అభిమానవతియైన సురేఖ మావయ్య పద్ధతులు, అత్త సూటీపోటీ మాటలు గిట్టక వేరే వెడదామంటుంది. కాని తినుఎన్నాళ్ళో బ్రతకనని. సురేఖ వంటరిగా వుండటం మంచిదికాదని తల్లి అభిప్రాయం. ఇలాంటి సురేఖ పరిచయం శోభకు తమాషాగా కలిగింది..ఒకరోజు శోభ, వాళ్ళ తమ్ముడు (పెద్దనాన్న కొడుకు) రాజాబజారునుండి వస్తూ, ఆ ఇంట్లోనుండి వినబడిన వీణా నాదానికి తన్మయులై ఇంట్లోకి వెళ్ళారు సురేఖ తల్లిని చూస్తే శాంతి అహింసలకు మారురూపమేమో అనిపిస్తుంది. ఆమొదటి పరిచయంలోనే సురేఖను రాజాకు వీణ నేర్పడానికి మాట్లాడి తీసికొనివచ్చి పెదనాన్నకు పరిచయం చేసింది.

"అక్కా సాయంత్రం మళ్ళీవస్తాను. ఇప్పుడు అమ్మకు అన్నం పెట్టాలి." అంటూ వెళ్ళింది సురేఖ

"అక్కా, ఈరోజు సినిమాకువెడదాం." అన్నాడు రాజా.

"నే రాలేనురా బాబూ" అంది శోభ.

"ఎందుకు రావు? పిక్చరుపేరు వింటే పరిగెత్తుకొస్తావ్! ఏమిటో తెలుసా? సాహెబ్ - బీబీ ఔర్‌గులాం. గురుదత్ పిక్చరు మిస్ అవుతావా?" అని ఊరించాడు రాజా.

"ఏం శోభగారూ! మనవాడు చూస్తే ఇంతవున్నాడో లేడో గురుగత్తును పొగడుతున్నాడు" అంటూ ప్రవేశించాడు రమణ.

"అహా! అంతేనా. ఇప్పుడు శంకర్, జైకిషన్‌లు ఎన్ని పిక్చర్లకు మ్యూజిక్ యిస్తున్నారో, షకీల్ బదాయూనీ ఎన్ని పిక్చర్లకు పాటలు రాస్తున్నాడో కూడా చెపుతాడు. కాని, అద్దాలకు ప్రసిద్ధి చెందినదేశం. ఏదీ అనండి బ్బెబ్బెబ్బె అంటాడు."

"ఏమీ అనను అద్దాలకు ప్రసిద్ధి చెందిన దేశం బెల్జియం. నాకు తెలీదా." అని అందుకున్నాడు రోషంగా రాజా.

"కరెక్టు నీకన్నీ తెలుసు. వెళ్ళి అన్నయ్యను లేపు. పిక్చరుకు వెడదాం" అన్నాడు రమణ.

"ఓ. కే" అంటూ పరుగుతీశారు రాజా.

"రాజా చాలా తెలివిగలవాడు. వీడిని చూస్తుంటే భగవంతుడు కళలన్నీ వీడిలో పోసి సృష్టించాడా అనిపిస్తుంది. మొన్న బాలానందం ఫంక్షన్‌లో వీడు వీణ వాయిస్తుంటే హాలంతా ఎంత నిశ్శబ్దంగా వుందనుకున్నారు? చీమ చిటుక్కుమంటే ఒట్టు. మీరు గమనించారో లేదో వాడు బొమ్మలు కూడా బాగా వేస్తాడు మన ప్రోత్సాహం వుంటే మంచి చిత్రకారుడవుతాడు."

"అవును రమణగారూ! పెదనాన్న వాడికి ఇప్పటికే విశ్రాంతిలేదు అంటున్నారు. ఇప్పట్లో అది కుదరదు. కాని వాడిని చూసినప్పుడల్లా ఇంత చక్కటి బిడ్డను కని, వానిని పెంచుకోడానికి నోచుకోలేని ఆ తల్లి మీద జాలికలుగుతూ వుంటుంది. పెద్దమ్మ ఎన్నో సంవత్సరాలు బిడ్డకోసం తపించిపోయింది. కాని వీడు పుట్టిన తర్వాత అయిదేళ్ళుకూడా బ్రతుకలేదు. అసలు వీడు నాలుగేళ్ళ వయస్సులోనే డబ్బాలమీద, వంటింట్లో పళ్ళాలమీద ఎప్పుడూ మద్దెల వాయిస్తూ వుండేవాడు ఎప్పుడూ మోతచేస్తాడని పెద్దమ్మ అవి అందకుండా దాచేది. ఏదీ అందకపోతే వాడు బల్లలమీద, తలుపుల మీద వాయించేవాడు. ఆ రోజుల్లో నాన్నగారి స్నేహితుడు ఒకాయన తబలిస్టు మనయింటికి వచ్చినప్పుడు వీడు చాలబాగా వాయిస్తాడని, తప్పక మృదంగం నేర్పించమని చెప్పారు. అప్పుడుగాని మేము వాడు వేస్తున్నదానిలోని లయ గమనించలేకపోయాము."

"అక్కా ఎందుకురాదో నేను చూస్తాను పద అన్నాడు అన్నయ్య. కాబట్టి అక్కా బి-రెడీ" అంటూ పరిగెత్తాడు రాజా.

"నిజం గా తల్లిలేకపోయినా రాజా అదృష్టవంతుడు" తృప్తిగా నిట్టూర్చాడు రమణ.

హృదయంలో ఎంత ఆవేదనవున్నా ఇలాగే స్నేహితులతోనూ, రాజాతోనూ, అమ్మ అన్నయ్యల ఆదరణతోనూ శోభకు రోజులు దొర్లిపోతున్నాయి.

## 5

మనస్సులు బావున్నా లేకపోయినా, కష్టాల పరంపరలతో జీవితాలు దుఃఖ భూయిష్ఠాలు అవుతున్నా, కాలం దానిదారిన అది నడిచిపోతుంది. మంచిమనస్సులు వక్రించాయంటే కాలమే దానిని సరిదిద్దాలి కాని మానవుడేమీ చేయలేడు.

ఉదయాన్నే లేచిన మధు తోటలో కొంచెంసేపు పచార్లుచేసి సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. చేతి మీద పడిన మంచుబిందువులను చూడగానే ఒక్కసారి క్రిందికి చూపు మరల్చాడు. మంచుబిందువులచే కప్పబడిన గడ్డి కనిపించింది. దానితోపాటు -

"చూడండి పచ్చని తివాసీమీద రవ్వల్లా ఎలా మెరిసిపోతున్నాయోమంచుబిందువులు" అనే శోభమాటలు గుర్తువచ్చాయి.

"ఆహా! ఆ రవ్వలు ఏరి నీకొక నెక్లెసు చేయించనా" అని నవ్వేవాడు తను.

ప్రకృతిని చూసి శోభ పరవశురాలైతే, ఆమెనుచూసి తాను పరవశుడయ్యేవాడు. అబ్బ! తాను ఎంతగా ప్రేమించాడు ఆమెను. కాని శోభ ఎందుకిలా చేసింది? తాను ఏమి అన్యాయం చేశాడని? పువ్వుల్లో పెట్టి పూజించాడే! దేవతలాగ ఆరాధించాడే! అలాంటి భర్తపట్ల ఇంత అన్యాయం చేసి అతని మనశ్శాంతిని దోచుకొనేదికూడా స్త్రీయేనా? కాదు....రాక్షసి....ఇన్నాళ్ళూ ఆ రాక్షసిని తాను దేవతగా భ్రమించాడు.

"నీ ముఖంలాగుంది. నే చదువుతాను చూడు. ప్రేమ వ్యవహారం తెలీకపోయినా కనీసం యాక్ట్‌చెయ్యటంకూడ రాకపోతే ఎలారా?"

వెనుకకు తిరిగిచూచిన మధుకు రమేష్, స్నేహితుడు వేణు పొగడచెట్టుక్రింద కనిపించారు. లేచి వారివైపు నడక ప్రారంభించాడు మధు.

"నా శరీరమైతే యిక్కడుంది గాని మనస్సు మీ చుట్టూ పరిభ్రమిస్తున్నది. నా యీ మూగ హృదయ ఘోషను మీ కెలా విన్నవించుకోను? శరీరంలోని ప్రతి అంగమూ, నాలోని ప్రతి రక్తపుచుక్కా మీ పేరునే ఉచ్చరిస్తున్నాయి. నా హృదయాన్ని ముక్కలుచేసినా ఆ ముక్కలు మిమ్మలనే స్మరిస్తాయి."

"వేణూ"

మధు వేసిన పిడుగులాటి కేకకు వేణు రమేష్ అదిరిపోయి అటుచూశారు. కోపాన్ని అణచుకొంటూనే వేణు చేతిలోని కాగితాలు తీసుకొన్నాడు అవును అదే నీలంరంగు లెటర్‌పాడ్ కాగితం. శోభ వ్రాసిన ప్రేమ కలాప సంభాషణ వణికిపోయాడు మధు

"ఏమిటిది రమేష్. ఇది వదిన వుత్తరం కాదా!"

"ఓలే వాడివన్నయ్యా. ఎల్లుండే గా యానివర్సరీ, అందులో డ్రామాలో నేను వీడిని ప్రేమిస్తావన్నమాట. అదే పోర్షన్ చదువుకొంటున్నాము."

రమేష్ అచ్చు అమ్మాయిలాగే వుంటాడు. స్టేజిమీద మీరు చూసి తీరాల్సిందే." అన్నాడు వేణు.

"అయితే వదిన ఎందుకు రాసింది ఇది" మధు అనుమానంగా అడిగాడు.

"నేనే టైమ్‌లేక వదినతో వ్రాయించుకొన్నాను."

"అది సరేగాని రమేష్, ఈకాగితాలు ఎవరికైనా యిచ్చావా? ఆలోచించిచెప్పు."





''ఎవరికీ యివ్వలేదుగాని ఆరోజు శేఖరు గారు చదువుతూ చదువుతూ మర్చిపోయి జేబులో పెట్టి వెళ్లానని మర్రోజు తెచ్చి యిచ్చారు."

కొయ్యబారిపోయాడు మధు.

''ఏం అన్నయ్యా. అలా అడుగుతున్నావ్?"

''అబ్బే, ఏంలేదురా." అంటూ భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్ళాడు. ఛీ! తానెంత నీచంగా ప్రవర్తించాడు. ఇటు కట్టుకొన్న భార్యనూ అటూ ప్రాణస్నేహితుణ్ణి ఎంత నీచంగా ఊహించాడు. ఆరోజు శేఖర్ బల్లమీద ఈ కాగితాలు చూచి తానెంత అపోహ పడ్డాడు! తాను శోభను ఎందుకడగలేదు? ఓహ్! అద్దంలాంటి శోభ మనసు పాడుచేశావే? ఏం చెయ్యాలి? శోభను క్షమాపణ కోరేవరకు మనసు నిలవడం లేదు.

''బాబుగారూ! చిన్న మీకు వచ్చిన వుత్తరాలు'' అంటూ నౌకరు బల్లమీద నాలుగు కవర్లు, రెండు కార్డులు పెట్టిపోయాడు. పై కవరుమీద ముత్యాలకోవ లాంటి అక్షరాలను అప్రయత్నంగా ముద్దుపెట్టుకొని కవరు చింపాడు మధు. రెండే రెండు ముక్కలు వ్రాసింది శోభ.

''మీకు అవసరం వున్నా లేకపోయినా, ఆనందం కలిగినా కలుగకపోయినా నా బాధ్యత గనుక తెలుపుతున్నాను. మీరు తండ్రి కాబోతున్నారు.''

ఆనందంతో ''అమ్మా'' అంటూ పెద్దగా అరిచాడు మధు.

''ఏమిట్రా ఆ కేకలు'' అంటూ అమ్మ వచ్చింది.

గబగబా నాలుగు గుడ్డలు సూట్‌కేసులో కుక్కుకొని,

''అమ్మా నేను బందరు వెడుతున్నానమ్మా. నీకు మనుమడు పుడతాడట'' అంటూ బయటకు పరుగుతీసి ''డ్రైవర్, కారు బయటకుతీయ్'' అని కేకపెట్టాడు.

''అదేమిట్రా! వట్టిచేతులతో ఎలా వెడతావ్. కోడలు వట్టిమనిషికూడా కాదాయె, మిఠాయిలు, పళ్ళు తీసికొని రేపు వెడుదువుగాని'' అంటూంటే-

''అవన్నీ తీసికొని రేపు నువ్వురా. నేనిప్పుడే వెడతా'' అంటూ కారు డోర్ మూశాడు.

''పిడి సంబరం బంగారంగాను. లేడికి లేచిందే పరుగని యిలా బయల్దేరాడేం!" అంటూ దవడ నొక్కుకుంది సుందరమ్మ గారు కొడుకు-కోడళ్ళ మధ్య జరిగిన కథ తెలీక. □□□

-అక్కల సరస్వతీ బాబూరావు

---

● జ్ఞాపకశక్తి ఎక్కువకావడానికి ఏవో మందులు తింటున్న ఆసామిని మరొకడు:

"ఇప్పుడెలా వుందండీ, మీ జ్ఞాపకశక్తి?''

"కొంతఫరవాలేదండి; ఏదో మరిచిపోయినట్టు జ్ఞాపకం రావడందాకా వచ్చింది — అదేదో జ్ఞాపకం రాకపోయినా."